# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 72 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 7

### విష్ణుదూతల సమాధానం

శ్రీమన్నారాయణుడి నామం నోట్లోంచి వచ్చినందుకు అంతకు ముందు చేసిన పాపాలన్నీ పోయి ఇప్పుడు అజామీళుడు పుణ్యాత్ముడయ్యాడని చెప్పాక హరినామ కీర్తనం గురించి ఇంకా చెప్తున్నారు విష్ణుదూతలు యమదూతలతో – బ్రహ్మహత్యాపాతకం వంటి మహాపాపాలని కూడా పోగొట్టగల నామం భగవంతుడిది అంటూ.

ఉ. కూలినచోటఁ గొట్టుపడి కుందినచోట మహాజ్వరాదులం
బ్రేలినచోట సర్పముఖ పీడల నందినచోట నార్తులై
తూలినచోట విష్ణు భవదూరునిఁ బేర్కొనిరేని మీఁద న
క్కాలుని యాతనావితతిఁ గానరు పూనరు దుఃఖల్. [6-123]

తూలి కింద పడినప్పుడూ, దెబ్బతిని (గొట్టుపడి) కుంగిపోయినప్పుడూ (కుందినచోట), మహాజ్వరంలాంటివి వచ్చి ప్రేలాపించినప్పుడూ, పాములు కరిచినప్పుడూ, ఆర్తులు (దుఃఖపడేవారు) భవబంధాలని దూరం చేసే విష్ణువుని తలుచుకుంటే యమయాతల పడరు.

సీ. అతిపాపములకుఁ బ్రయత్న పూర్వకముగఁ;
దనుపాపముల కమితంబు గాఁగ
సన్ముని వరులచే సంప్రోక్తమై యుండు;
నిర్మలం బగు పాప నిష్కృతములు
గ్రమరూపమున నుపశమనంబులగుఁ గాని;
తత్పాపచయములు దరువ లేవు;
సర్వకర్మంబుల సంహార మొనరించి;
చిత్తంబునకుఁ దత్త్వసిద్ధి నొసఁగు [6-124]

ఆ. నొనర నీశు సేవ, యోగిమానస సరో
వాసు సేవ, హేమవాసు సేవ,
వేదవేద్యు సేవ, వేదాంత విభు సేవ,
పరమపురుష పాదపద్మ సేవ. [6-124.1]

పెద్దపాపాలకి పెద్ద ప్రాయశ్చిత్తాలూ, చిన్నవాటికి చిన్నవీ అని మునులు నిర్ణయించారు. అయితే ఈ ప్రాయశ్చిత్తాల వల్ల కాస్త ఉపశమనం కలుగుతుంది కానీ అవి పూర్తిగా పోవడం కుదరదు. అజామీళోపాఖ్యానం మొదట్లోనే శుకయోగి చెప్పడం చూస్తే ఇదే మరో సారి తెలుస్తుంది – కర్మము కర్మము చేతను నిర్మూలము కాదు...(6.48). అయితే చేసిన పాపం పోగొట్టుకోవాలంటే, తత్వసిద్ధి కావాలంటే భగవంతుడి సేవ ఒకటే దారి. ఆ సేవ యోగుల మనస్సనే సరోవరంలో ఉండేవాడి సేవ, బంగారు వస్త్రాలు ధరించేవాడి (హేమవాసు) సేవ, వేదవేద్యుడి సేవ, వేదాంతవిభుడిసేవ, పరమ పురుషుడి పాద పద్మాలకి చేసే సేవ.

క. హరి నెఱుగని యా బాలుఁడు
హరిభక్తులతోడఁ గూడి హరి యను వాఁడున్
సరియై దోషము లడఁచును
గరువలితో నగ్ని దృణముఁ గాల్చిన భంగిన్. [6-125]

హరి అంటే ఏమిటో తెలియకపోయినా, మిగతావాళ్లతో కలిసి హరి హరి అని ఏ పిల్లవాడైనా అన్నాడంటే, వాడిపాపాలన్నీ పోతాయి. గాలితో కలిసి నిప్పు గడ్డిని కాల్చినట్టూ. ఈ పద్యంలో గాలి అనే పదం ఎక్కడుందో చెప్పండి చూద్దాం? కరువలి – గాలి.

ఉ. ఆరయ వీర్యవంత మగు నౌషధమెట్లు యదృచ్ఛఁ గొన్న ద
చ్చారు గుణంబు రోగములఁ జయ్యనఁ బాపెడు మాడ్కిఁ బుణ్య వి
స్ఫారుని నంబుజోదరునిఁ బామరుఁ డజ్ఞుఁ డవజ్ఞఁ బల్కినన్
వారక తత్ప్ర ధ్రువంబుగ నాత్మగుణంబుఁ జూపదే? [6-126]

ఇదంతా ఎందుకు చెప్తున్నారంటే, ముందు మనకి దాని గుణం తెలియకపోయినా మంచి ఔషధం సేవిస్తే, జబ్బు నయం అవుతుంది కదా? అలాగే పద్మం ఉదరంలో ఉన్న శ్రీపతి నామం అజ్ఞుడైనవాడు (తెలియనివాడు) అవజ్ఞతతో (తెలియకపోయినా, తిరస్కారంతో అయినా) పలకగానే దాని ప్రభావం చూపిస్తుంది.

క. ధృతి దప్పిన తఱినిఁ బురా
కృతమునఁ గాకెట్లు దోఁచుఁ గేశవుఁడు మదిన్
మితి లేని జగముఁ దాల్చిన
యతఁ డొక్కని మనములోన నడఁగెడు వాఁడే? [6-127]

వంటిమీద తెలివి పోతున్న సమయంలో (ధృతి తప్పిన తరిని) పూర్వజన్మ సుకృతం ఉంటేగానీ (పురాకృతమున) కేశవుడు – అనంతమైన (మితిలేని) జగత్తుకి కారణమైనవాడు, ఒక్కడి మనసులో మాత్రమే ఇమిడేవాడు కాదు కదా - మనసులోకి రాగలడా?

మ. నిరతంబై నిరవద్యమై నిఖిల చిన్నిర్మాణమై నిత్యమై
నిరహంకార గుణాఢ్యమై నియమమై నిర్దోషమైనట్టి శ్రీ
హరి నామస్మర ణామృతం బితఁడు ప్రత్యక్షంబు సేవించెఁ దా
మరణాంతంబున నిట్టి సజ్జనుని ధర్మంబేల వ్యర్థం బగున్. [6-128]

అవన్నీ అలాఉంచితే, హరి నామం ఎటువంటిది? నిరతంబై (శాశ్వతం), నిరవద్యమై (ఏ లోపం లేనిది), అఖిల చిన్నిర్మాణమై (సమస్తానికీ అలవాలము, కారణం), అహంకారం లేనిది, సద్గుణాలు కలది, దోషం లేనిది (నిర్దోషమై). అటువంటి అమృతమైన హరినామస్మరణం ప్రత్యక్షంగా, అదీ దేహం వదులుతూ, చేసిన పుణ్యాత్ముడు ఈ అజామీళుడు. ఇంతటి సజ్జనుడి పుణ్యం ఎలా, ఎందుకు వ్యర్థం అవుతుంది?

భగవంతుడే సమస్తానికీ అలవాలం అనేదాన్ని భగవద్గీత విభూతి యోగం లో కూడా చూడవచ్చు. అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః (10.20) అంటూ మొదలుపెట్టి చెప్పడం

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున
నతదస్థి వినా యత్స్యాన్మయా భూతం చరాచరం (భగవద్గీత విభూతి యోగం 39)

ఈ ప్రపంచంలో ఏదైతో ఉందో అందులో నా బీజం లేనిదేదీ లేదు. నా అంశ లేకుండా చరాచర (కదిలే, కదలని) వస్తువుల్లో స్వతంత్రంగా నిలబడగలిగేది ఏ ఒక్కటీ లేదు. అలా ప్రపంచాన్ని నిలుచోబెట్టే శక్తి భగవంతుడు కనక అది శాశ్వతం. దీనినే మనకి కొత్తగా కనుగొన్న విషయంగా పాఠశాల పుస్తకాల్లో చెప్పడం గమనించవచ్చు – శక్తి అనేది నశింపచేయలేనిది. అది ఒకరూపంలోంచి మరో రూపంలోకి మారవచ్చు కానీ శక్తి అనేది ఎప్పుడూ శాశ్వతం.

వ. అని యిట్లు భగవద్దూతలు భాగవతధర్మంబు నిర్ణయించి, ఈ యర్థంబున మీకు సంశయంబు గలదేని మీ రాజు నడుఁగుదు; పొం" డని పలికి బ్రాహ్మణుని నతిఘోరం బైన యామ్యపాశబంధ నిర్ముక్తునిం గావించి, యమభటుల వలని యుదుటు వాపి; రంత నా యమదూత లా భగవద్దూతల సంభాషణ ప్రభావంబునఁ దమ మనంబుల శాంతి నొంది భగవత్తత్త్వ జిజ్ఞాసులై చేయునది లేక నిరాకృతులై, యమలోకంబునకుం జని, పితృపతికి సర్వంబును నెఱింగించిరి; అంత. [6-129]

శ్రీహరి గురించి ఇంత చెప్పాక, మీకు ఇంకా ఈ విషయంలో ధర్మ సందేహం ఉంటే, ధర్మాన్ని నిర్ణయించే మీ యజమాని యమధర్మరాజు దగ్గరకి వెళ్ళి అడగండి అని అజామీళుణ్ణి యమపాశాల్లోంచి విడిపించారు. యమదూతలు ఇంక ఏం చేయాలో తెలియక వాళ్ల రాజు దగ్గిరకెళ్ళి జరిగినదంతా చెప్పారు. తర్వాత కథ చదవడానికి ముందు అభ్యాసం గురించి చిన్న పిట్ట కథ చెప్పుకుని ఈ నెల వ్యాసం ముగిద్దాం.

ఓ ఊర్లో ఒక షావుకారు ఉండేవాడు. పొద్దున్న లేచినప్పటినుంచి సాయంత్రం దాకా ఏదో ఒక పని, ఊపిరి సలపని వ్యాపారం, డబ్బు పోగేసుకోవడం వగైరా. ఏదో ఒకసారి ఎవరో పోరితే హరికథ వినడానికి వెళ్ళాడు. ఇలా వెళ్ళేవారి సంగతి మనకి తెలిసిందే కదా – మనందరం కూడా అలాంటివాళ్ళమే. హరి కథ జరిగినంతసేపూ ముళ్ళమీద కూర్చున్నట్టూ కూర్చోవడం. "ఆ, ఆయనేదో చెప్తార్లే, అందులో నాకు పనికొచ్చేదేముంది?" అనుకోవడం. అది అయిపోయాక మర్నాటికి ఏదీ గుర్తుండదు. మళ్ళీ మనగోల మనదే. ఆ హరికథ చెప్పిన స్వామిగారు ఈ వ్యాపారస్తుణ్ణి చూసి మర్నాడు వాళ్ళింటికి వచ్చేరు వాళ్ళ పిలుపుమీద. ఈ స్వామిగారిని కుటుంబం అడిగారు – ఈ వ్యాపారస్తుడికి దేనికీ తీరికలేదు కాస్త భగవంతుణ్ణి గుర్తుంచుకునే మార్గం చెప్పండి అని. పూర్వజన్మ సుకృతం అనండీ, మరొకటో అనండీ, ఆ స్వామిగారికి ఈయన మీద దయ ఉందేమో, "అయ్యా మీరు రోజూ విష్ణుసహస్రనామం చేయండి" అని చెప్పారు. షావుకారికి అరికాలి మంట నెత్తిమీదకొచ్చి అరిచాడు, "నాకు సమయం లేదు, ఆ విష్ణు సహస్రనామం చేయడానికి అరగంట పడుతుంది, నాకు నోరు తిరగదు" వగైరా కారణాలు చెప్తూ.

"అయితే పొద్దున్న నుంచీ మీరు చేసే పనులు చెప్పండి. ఎక్కడో ఒకచోట తీరిక చేసుకునే మార్గం నేను చూపిస్తా" అని స్వామిగారనేసరికి, ఏ కళనున్నాడో గానీ ఈయన ఓపిగ్గా చెప్పడం మొదలుపెట్టాడు. పొద్దున్న అయిదింటికి లేవడం, దంత ధావనం, స్నానం, ఫలహారం,

అలా మొదలుపెట్టి రాత్రిపడుకునేదాకా చేసే విషయాలన్నీ చెప్పాడు. “స్నానానికీ ఫలహారానికీ మధ్య అయిదు నిముషాలు కుదరదా?” అంటే, కుదరదని సమాధానం. “వ్యాపారం జరుగుతున్నప్పుడు మధ్యలో ఒక్క అయిదు నిముషాలు తీరిక చేసుకోకూడదా?” అంటే, కూడదని సమాధానం. ఇలా అన్నింటికీ కుదరదని చెప్పాక స్వామిగారు అన్నారుట – “మీరు స్నానం చేసేటప్పుడు మొదటి చెంబు నీళ్ళు తల మీదపడుతూండగానే ‘విశ్వం విష్ణుర్వ షట్కారో భూతభవ్య భవత్ప్రభూ...’ అంటూ మొదలుపెట్టండి, స్నానం అయ్యేసరికి మొత్తం సహస్రనామం చేసేయవచ్చు” అని. ఎందుకో ఈ సారి “సరే అలాగే చేస్తా”నని మాట ఇచ్చాడు – ఎక్కడా తనకి సమయం వృథాగా పోదు కదా? అలా రోజూ విష్ణు సహస్రనామం పారాయణ చేయడం నేర్చుకున్నాడు.

కొన్నాళ్లకి అవసానదశ వచ్చింది. ఎలాగా పోతాడని తెలిసినప్పుడు ఇంట్లో వాళ్లంతా చెప్పారు – “నీకొచ్చిన విష్ణు సహస్రనామం మొదలుపెట్టు, ఇదే మంచి సమయం” అని. ఈయన ఎప్పట్లాగే “అబ్బే నాకు తీరికలేదు” అని చెప్పేడు ఈ పరిస్థితిలో కూడా. వెంఠనే ఎవరో పరుగు పరుగున స్వామివారి దగ్గిరకెళ్ళి ఆయన్ని తీసుకొచ్చారు. ఆయన షావుకారుతో మిగతావాళ్ళు అందరూ అన్నదే చెప్తే అప్పుడు కూడా అదే ‘నాకు తీరికలేదు’ అనే సమాధానం. అప్పుడు స్వామిగారు ఇంట్లోవాళ్లతో చెప్పారు – చెంబుతో నీళ్ళు తలమీదపోయడం మొదలుపెట్టండి అని. మొదటి చెంబుతో నీళ్ళు తలమీద పడడంతోటే, ఇన్నేళ్ళూ చేసిన అలవాటు వల్ల షావుకారు నోట్లోంచి “విశ్వం విష్ణుర్వషట్కారో..” అంటూ శ్లోకం వస్తూండగానే ఆయన ప్రాణం పోయింది. బాగుంది కదా?

అదీ అభ్యాసం మహిమ. అందువల్ల జీవితాంతం అలా అభ్యాసం చేస్తూనే ఉండాలి అంటారు. ఏది మనం అభ్యాసం చేస్తామో అదే అవసానదశలో గుర్తుకు వచ్చే అవకాశం ఉంది కదా?

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS